
నల్లమల అటవీప్రాంతంలో కాలినడకన వస్తున్న భక్తులు




పాదయాత్రగా వస్తున్న వృద్ధులు , పిల్లవాడిని భుజాన ఎత్తుకొని పాదయాత్రగా వస్తున్న కన్నడ భక్తుడు, కావడి ఎత్తుకొని..


క్షేత్ర పరిధిలో ప్రైవేట్ వాహనాల పార్కింగ్

ఇలకైలాసం.. భక్తజన పరవశం


కర్ణాటక ఆర్టీసీ బస్సుల పార్కింగ్

- మల్లన్న దర్శనానికి పోటెత్తిన కన్నడ భక్తులు
- ఎండలు సైతం లెక్కచేయకుండా శివనామస్మరణతో పాదయాత్ర
- రద్దీకి అనుగుణంగా పూజవేళల్లో మార్పు

శ్రీశైలంటెంపుల్: ఇలకైలాసమైన శ్రీశైల మహాక్షేత్రంలో వైభవంగా జరుగుతున్న ఉగాది మహోత్సవాలను తిలకించి అధ్యాత్మిక అనుభూతిపొందుతూ కన్నడ భక్తులు పరవశించిపోతున్నారు. ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్రల నుంచి లక్షలాది మంది భక్తులు శ్రీగిరికి చేరుకుంటున్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా నల్లమల అడవుల్లో పాదయాత్రగా వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. క్షేత్రానికి చేరుకున్న కన్నడ భక్తులు స్వామిఅమ్మవార్ల దర్శనానికి బారులు తీరుతున్నారు.

భక్తులకు విస్తృత ఏర్పాట్లు

శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం కన్నడ భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేసింది. మల్లన్న దర్శనానికి భక్తులు వేకువజామునుంచే క్యూలైన్ల వద్ద బారులు తీరారు. కన్నడ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ఆలయ పూజా వేళలను మార్పులు చేసి వేకువజాము నుంచే భక్తులను దర్శనానికి అనుమతిస్తున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులను దర్శనానికి అనుమతిస్తున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులందరికి స్వామిఅమ్మవార్ల దర్శనం కలిగేలా అలంకార దర్శనాన్ని మాత్రమే కల్పిస్తున్నారు.


పురవీధిలో కన్నడ భక్తుల సందడి

వృద్ధులు సైతం పాదయాత్రగా..

ఎండను సైతం లెక్కచేయకుండా వేలాది మంది కన్నడ భక్తులు చంటి పిల్లలతో మహిళలు, వృద్ధులు సైతం నల్లమల అడవుల్లో పాదయాత్రగా తరలివస్తున్నారు. తప్పెట దరువులతో, రంగులు చల్లుకుంటూ, చిందులు వేస్తూ మల్లన్న..నీ దర్శనానికి వచ్చాం..అంటూ కన్నడ భక్తులు ఆనందోత్సవాలు జరుపుకుంటున్నారు. ఉత్సవాల్లో భాగంగా రెండవరోజు ఆదివారం మహాదుర్గ అలంకారంలో శ్రీశైల భ్రామరీ దర్శనమివ్వగా, కైలాసవాహనంపై భ్రమరాంబా సమేత మల్లికార్జునుడు దర్శనమిచ్చారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవాన్ని కనులారా తిలకించి భక్తులు అధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు.


కైలాసద్వారం వద్ద లింగానికి మొక్కుతున్న కన్నడ భక్తులు

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి


కోనేటమ్మపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు

నందికొట్కూరు రూరల్ : వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కోనేటమ్మపల్లి గ్రామంలో ఎంపీపీ నిధులతో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామానికి నూతన బీటీ రోడ్డు నిర్మించడంతో ఆయనకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పండుగలు సంప్రదాయాలకు ప్రతీకలు

ఆత్మకూరు: పండగలు సంప్రదాయాలకు ప్రతీకలని ప్రగతి హైస్కూల్ కరస్పాండెంట్ రాఘవకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక పాఠశాలలో ఉగాది, రంజాన్ పండగలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఉగాది, రంజాన్ పండుగల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామారావు, శ్రీధర్, మురళీ, రామసుబ్బయ్య, షబానా, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

వడదెబ్బతో లస్కర్‌కు అస్వస్థత

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన లస్కర్ పురంధరుడు ఆదివారం వడదెబ్బ బారినపడి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. శనివారం పని నిమిత్తం నంద్యాలకు బైక్‌పై వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో ఎండతీవ్రత తట్టుకోలేక నందికొట్కూరులో శీతలపానీయాలు తాగి తాత్కాలిక ఉపశమనం పొంది గ్రామానికి చేరుకున్నాడు. అయితే అర్ధరాత్రి తీవ్రమైన కడుపునొప్పి, వాంతులు, విరేచనాల బారినపడి సొమ్మసిల్లాడు. వెంటనే స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుని సంప్రదించి ప్రథమ చికిత్స తీసుకోవడంతో ప్రాణాపాయం తప్పిందని బాధితుడు పేర్కొన్నాడు.

కార్మికుల పక్షాన పోరాటం


ఆత్మకూరు: కార్మికుల పక్షాన పోరాటాలకు, సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యేసురత్నం అన్నారు. పట్టణంలోని సుదర్శనవర్మ భవనంలో ఆదివారం ఆత్మకూరు, నందికొట్కూరు నియోజకవర్గాల పరిధిలో రాజకీయ తరగతులను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఐటీయూ చేసిన పోరాట ఫలితమే కార్మికులకు నేడు రక్షణ చట్టాలు వచ్చాయని చెప్పారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం 43 రోజులపాటు సమ్మె చేస్తే వారికి సీఐటీయూ పూర్తిస్థాయిలో మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గోపాల్, రజాక్, రామ్‌నాయక్, రణధీర్, రామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం


మహానందిలో చండీహోమంలో పాల్గొన్న భక్తులు

మహానంది: మహానంది క్షేత్రంలో మాసశివరాత్రి సందర్భంగా చండీహోమం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు ఆర్జిత సేవల్లో భాగంగా చండీహోమం పూజలను చేయించుకున్నారు. స్థానిక యాగశాలలో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా హోమం చేపట్టారు. పూజల అనంతరం భక్తులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

మరకతలింగేశ్వరుడికి మహారుద్రాభిషేకం


ప్రత్యేక అలంకరణలో మరకతలింగేశ్వరస్వామి

మహానంది: మాసశివరాత్రి పురస్కరించుకుని గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో కొలువైన శ్రీ గంగా, గౌరీసమేత మరకతలింగేశ్వర స్వామికి ఆదివారం మహారుద్రాభిషేకం పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు ఉదయం స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. స్వామివారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేపట్టారు. సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని నవగ్రహ దేవాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి, సంక్షేమ పాలన


విద్యానగర్‌లో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి సంక్షేమ పాలన అందించారని శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని విద్యానగర్‌లో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల పాలనలో సీఎం జగనన్న చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. విద్యానగర్‌లోని ప్రజలతో సిద్ధార్థ మమేకమయ్యారు. మళ్లీ సీఎం వైఎస్ జగనన్నను ఆశీర్వాదించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలు, అభివృద్ధి చేసి చూపించిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కిందన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన తెల్లవారుజామున తలుపు తట్టి పింఛన్లు అందించిన ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని చెప్పారు. పట్టణంలో సీఎం వైఎస్ పాలనలో సంక్షేమ పథకాల ఖర్చు, అభివృద్ధి ఖర్చు కలిపితే రూ. 300 కోట్లకు పైగా ప్రభుత్వం వెచ్చించిందని చెప్పారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబేనన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ నాయకులకు, కార్యకర్తలకే పథకాలు ఇచ్చారని గుర్తు చేశారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, కౌన్సిలర్లు రవూఫ్, లాలు, సురేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, నాయకులు చంద్రమౌళి, ఉస్మాన్‌బేగ్, రజినీకుమార్‌రెడ్డి, జబ్బార్, మాధురి, శ్రీకాంత్, విజ్జి, ఉపేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: తెలుగు సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర తెలుగు క్యాలెండర్‌ను బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆవిష్కరించారు. త్రైతసిద్ధాంతం సేవాసమితి సభ్యులు రామచంద్రుడు, మునిదాసు, పుల్లారెడ్డి, కుమారాచారి, భాస్కర్, మద్దిలేటి, సంజీవ, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

మహా‘ఆదిత్యుడు’!


మహానందిలో గోపుర కలశంపై ఒదిగిన ఆదిత్యుడు

మహానంది: మహానందానికి నిలయం మహానంది ఆలయం. సంధ్య వేళలో అరుణవర్ణంలో ఉన్న ఆదిత్యుడి మహానందిలోని ఆలయ గోపుర కలశాలపై ఒదిగిపోయాడు. ఆకాశం అంతా అరుణవర్ణంలోకి మారగా ఎర్రటి ఆదిత్యుడు జ్ఞానజ్యోతిలా దర్శనమిచ్చాడు. ఈ దృశ్యాలు చూసిన భక్తులు ఆహా...మహానందం అంటూ తిలకించారు.

కేసు నమోదు

మిడుతూరు: మండల పరిధిలోని వీపనగండ్ల, చెరుకుచెర్ల గ్రామాల శివారుల్లో పేకాట ఆడుతున్న 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు చెరుకుచెర్ల గ్రామానికి చెందిన ఐదుగురు పేకాట ఆడుతుండగా వారిని అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి రూ.3,100, అదేవిధంగా వీపనగండ్ల గ్రామంలో ఐదుగురిని అదుపులోకి తీసుకొని రూ.3,200 స్వాధీనం చేసుకున్నామన్నారు.

బెస్తల ఆత్మీయ సమ్మేళనం

నంద్యాల(అర్బన్): పట్టణ శివారులో వెలసిన జంబులాపరమేశ్వరి దేవస్థాన కల్యాణ మండపంలో రాయలసీమ స్థాయి బెస్తల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర ఫిషర్‌మెన్ జేఏసీ కో కన్వీనర్ రవీంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శివ, కోదండ, రాజు, వెంకటేష్, మద్దిలేటి, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సుపరిపాలన


నాగలూటి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్

మిడుతూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుపరిపాలన సాధ్యమని వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగలూటి, పైపాలెం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కల్లబొల్లి మాటలు చెప్పి కొంతమంది ఎన్నికల ప్రచారం చేస్తున్నారని, 14 ఏళ్ల రాజకీయ అనుభవం గల చంద్రబాబు సీఎం జగన్‌ను చూసి భయపడి జనసేన, బీజేపీతో కలసి కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు వెళ్లి మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జగనన్న అధికారం చేపట్టిన తర్వాత ఐదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సుపరిపాలన అందించారన్నారు. ఎక్కడా ఒక్క రూపాయి అవినీతి జరగకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సంక్షేమ పథకాల నగదు జమచేశామని చెప్పారు. కార్యక్రమంలో నాగలూటి, పైపాలెం గ్రామ సర్పంచ్‌లు తమిదెల ఉషారాణి, మర్రి రామచంద్రుడు, మండల ఉపాధ్యక్షుడు నబీర సూల్, పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి, ఉపసర్పంచ్‌లు యశోదమ్మ, రామకృష్ణ, మండల జేఏసీ కన్వీనర్ రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన తర్తూరు ఫెస్టివల్ కమిటీ గడువు


లక్ష్మీదేవి అమ్మవారు


భక్తులకు దర్శనమిస్తున్న శ్రీరంగనాథస్వామి

- ఆలయ ఈఓ ఆధ్వర్యంలో జాతర నిర్వహణ

జూపాడుబంగ్లా: తర్తూరు ఆలయ కమిటీ నియామకపు గడువు ముగియడంతో ఈనెల 17 నుంచి ప్రారంభమయ్యే తర్తూరు జాతరను ఆలయ ఈఓ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఇప్పటిదాకా తర్తూరు ఆలయానికి శాశ్వత కమిటీని నియమించిన దాఖలాల్లేవు. రెండేళ్ల కాల పరిమితితో తాత్కాలిక కమిటీని నియమిస్తూ తర్తూరు జాతరను నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో జాతరలో టెంకాయలు, లడ్డూల విక్రయం, టెంకాయచిప్పల వేలంతో పాటు తద్వారా వచ్చిన మొత్తాన్ని అర్చకుడు, వాచ్‌మెన్ల వేతనాలతో పాటు ఆలయ అభివృద్ధి కోసం వెచ్చించాల్సి ఉంది. రెండేళ్ల క్రితం నియమించిన ఆలయ కమిటీ గడువుకాలం ముగియడం, ఎన్నికలకోడ్ నేపథ్యంలో ప్రస్తుతం నూతన కమిటీ నియామకం జరిగే అవకాశాల్లేవు. దీంతో ఆలయ ఈఓ వెంకటరమణ ఆధ్వర్యంలో తర్తూరు జాతర నిర్వహణతో పాటు టెంకాయలు, లడ్డూలు, కొబ్బరిచిప్పల వేలం పాటలు త్వరలో నిర్వహించనున్నారు. ఈ విషయమై ఆలయ ఈఓ వెంకటరమణ మాట్లాడుతూ తర్తూరు జాతరకు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శ్రీలక్ష్మీరంగనాథస్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు.

కల్పవల్లి.. మూలపెద్దమ్మ తల్లి

- ఈ నెల 10 నుంచి వచ్చే నెల 11 వరకు పెద్దమ్మ జాతర
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు

గడివేముల: మండల కేంద్రంలో కొలువైన మూల పెద్దమ్మ భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా వెలుగొందుతున్నారు. ఈ నెల 10 నుంచి వచ్చే 11వ తేదీ వరకు నెల రోజుల పాటు జాతర నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏటా ఉగాది పండుగ మరుసటి రోజు మూల పెద్దమ్మ వారి జాతర ప్రారంభమవుతుంది. నెల రోజుల పాటు ప్రతి మంగళవారం, ఆదివారం భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి తమ మొక్కులు తీర్చుకుంటారు.

10 నుంచి ప్రత్యేక పూజలు

ఈ నెల 10వ తేదీ నుంచి వచ్చే నెల 11వ తేది వరకు జరిగే జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ తలారి చిన్నన్న, ఈఓ మోహన్ తెలిపారు. 10న దేవస్థానం వారిచే అమ్మవారికి ఉదయం ఆకుపూజ, కుంకుమార్చన పూజలు ఉంటాయి. సాయంత్రం అమ్మవారి ఘటానికి పోవుట, వాల్మీకులు బోనాలు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 11న ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకు పూజ, కుంకుమార్చన పూజలు చేసుకునేందుకు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల కాలక్షేపం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాట్లు చేసినట్లు చైర్మన్, ఈఓలు తెలిపారు. 11వ తేదీ బైక్‌స్లో పందెం, గుండు ఎత్తుట, తాడులాగు పోటీలు నిర్వహిస్తున్నారు.


మూలపెద్దమ్మ అమ్మవారు

జాతరకు ప్రత్యేక బందోబస్తు

మూలపెద్దమ్మ జాతరకు ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకార్యార్థం నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలోనికి భారీ వాహనాలు రాకుండా దారి మళ్లించనున్నారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

- పండుటాకుల కష్టాలకు తెర
- పింఛన్ల పంపిణీ పూర్తి చేసిన సచివాలయ ఉద్యోగులు

నందికొట్కూరు రూరల్ : మండలంలో పింఛన్ల పంపిణీ సజావుగా సాగింది. గడిచిన మూడు రోజులు పండుటాకులు పడిన కష్టాలకు తెరపడింది. సచివాలయాల్లో సిబ్బంది సక్రమంగా లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందించారు. ప్రతి నెలా మొదటి రోజునే పింఛన్ సొమ్మును వలంటీర్లు అందించేవారు. కానీ ప్రస్తుతం టీడీపీ పన్నిన కుయుక్తుల కారణంగా ఎన్నికల కమిషన్ వారిని విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించింది. దీంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా సచివాలయాల ద్వారా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. మండలంలోని బొల్లవరం, అల్లూరు, నాగటూరు, బిజినవేముల తదితర గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు ఆయా సచివాలయాల్లో పింఛన్లను పంపిణీ చేశారు. నడవలేని, మంచానికే పరిమితమైన లబ్ధిదారులకు వారి ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. వలంటీర్లు అయితే ఎటువంటి సమస్య ఇబ్బందులు లేకుండా నేరుగా ఇంటికే పింఛన్ సొమ్మును అందించే వారని పింఛన్‌దారులు తెలిపారు. చంద్రబాబు కుట్ర వల్ల వారిని విధుల నుంచి దూరంగా ఉంచడంతో సచివాలయాలకు వెళ్లి తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చిందని, చంద్రబాబు హయాంలో పింఛన్లకోసం పడిగాపులు కాసిన రోజులు గుర్తొచ్చాయని పేర్కొంటున్నారు.


నాగటూరు సచివాలయంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

జగనన్న వస్తేనే మాకష్టాలు తీరుతాయి



మళ్లీ జగనన్న ముఖ్యమంత్రిగా వస్తేనే మా కష్టాలు తీరుతాయి. గతంలో మా ఇంటి చెంతకే ఒకటో తేదీనే పింఛన్ అందించేవారు. ఇప్పుడేమో సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. మళ్లీ జగనన్నను గెలిపించుకుని వలంటీర్ ద్వారా ఇంటి వద్దనే పింఛన్ అందుకుంటాం.

– గోపాల్, లబ్ధిదారుడు, బొల్లవరం

వలంటీర్ వ్యవస్థతో ఎంతో మేలు



వలంటీర్ వ్యవస్థ అవసరం ఎంతైనా ఉంది. ప్రజలకు సేవలు అందించడంలో వారికి మించిన వారు లేరు. ఈ నెలలో పింఛన్లు వలంటీర్లు పంచకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. సచివాలయానికి అష్టకష్టాలు పడుతూ వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మొదటి సంతకం వలంటీర్ల నియామకంపై పెడతామని చెప్పడం అభినందనీయం.

– రాముడు, లబ్ధిదారుడు, బొల్లవరం

లయన్స్‌క్లబ్ సభ్యుడికి అవార్డు

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన లయన్స్‌క్లబ్ సభ్యుడు పెసల శ్రీకాంత్‌కు లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 316.. 2022–23 సంవత్సరానికి గాను చంద్రకిరణ్ అవార్డు అందజేసిందని ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో జరిగిన సర్వీసు అవార్డ్స్ కార్యక్రమంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఫీడ ద హంగర్ (రోగులకు అన్నదాన కార్యక్రమం) ప్రతిరోజూ నిర్వహించినందుకు 6వ సారి ఈ అవార్డు దక్కిందని చెప్పారు.



అవార్డును అందుకుంటున్న పెసల శ్రీకాంత్

భక్తుల కొంగు బంగారం కంబగిరయ్య

ఉయ్యాలవాడ : కోరికలు నెరవేర్చి భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు సుద్దమల్ల గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి. ఉగాది పండుగ సందర్భంగా ఏటా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది వేడుకలు నిర్వహించడానికి నిర్వాహకులు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో భాగంగా దేవస్థానం కార్యనిర్వహణ అధికారి చంద్రుడు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఉత్సవాలకు మండలంలోని వివిధ గ్రామాలతో పాటు వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. పండుగ రోజు సంప్రదాయం ప్రకారం ఆలయ ప్రాంగణంలో శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి, లక్ష్మీదేవికి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు సుద్దమల్ల, అల్లూరు, ఉయ్యాలవాడ గ్రామాల నుంచి తేరుబండ్లతో తరలివచ్చి ఆలయం చుట్టూ వృషభరాజములచే ప్రదక్షిణ చేస్తారు. స్వామిని దర్శించుకోవడం వల్ల సర్వపాపాలు హరించబడతాయని, కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం.


సుద్దమల్లలో ముస్తాబయిన ఆలయం